# వినియోగహక్కు

E-mail:
viniyogahakku@gmail.com
ఎడిటర్–డివి. లక్ష్మీనారాయణ
సెల్ - 9948774542

viniyogahakku
consumers news website
www. viniyogahakku.com

ఏప్రిల్ 2018 గుంటూరు


# గుంటూరులో నిభంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్లకు విద్యుత్ సరఫరా

గుంటూరు నగరం, పరిసర ప్రాంతాలలో నానాటికి అభివృద్ధి శరవేగంగా జరుగుతుండటంతోగృహసముదాయాలు (అపార్టుమెంట్లు), వాణిజ్య సముదాయాలు భారీ సంఖ్యలో నిర్మాణాలు అవుతున్నాయి. దాంతో అనేక చోట్ల నిభంధనలు పక్కనపెట్టి స్వప్రయోజనాలే ప్రాతిపదికగా అపార్టుమెంట్లకి విద్యుత్ సరఫరా ఇస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. సేకరించిన సమాచారం ప్రకారం...లోగడ 2 సంవత్సరాల క్రితం వరకు అపార్టుమెంటుకి విద్యుత్ సరఫరా కావాలంటే ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకి అధికారింగా ఖరీదు వినియోగదారులు (బిల్డర్) చెల్లించాల్సివచ్చేది. అయితే ఈ నిభంధన తొలగించి విద్యుత్ సంస్థ సొంత ఖర్చుతో ప్రత్యేక ట్రాన్సఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే విద్యుత్ లైన్లు లేనిచోట లైన్ల ఖర్చు ఇవ్వటికి వినియోగదారులే భరించాలి. లైన్‌లకి అంచనాలు వేయటంలో భారీగా అనధికార ఫీజు సమర్పించుకోవాల్సి ఉంటుంది. తాంబూలం ముట్టకపోతే రెట్టింపునుండి నాలుగు రెట్లు అంచనా పెరిగిపోతుంది. సహజంగా తక్కువ లోడు కలిగి ఉండే ఏక గృహాలకు వినియోగదారులు వాళ్లే స్వయంగా కొత్త సర్వీసుకి దరఖాస్తు చేసుకుంటారు. ఏదైనా ఇబ్బంది ఉంటే నైవేద్యం సమర్పించుకుంటారు. కాని అపార్టుమెంట్ల విషయంలో వాస్తవ వినియోగదారుల ప్రమేయం ఏమి ఉండదు. అపార్టుమెంటు నిర్మించే బిల్డర్ అన్ని వ్యవహారాలు చక్కపెడతారు. అధికార,అనధికార ఖర్చులన్ని కలిపి అంచనావేసి వినియోగదారుల నుండే వసూలు చేస్తారు. ఒక్కొక్క అపార్టుమెంటుకి సుమారు 10 నుండి 40 ప్లాట్‌ల వరకు ఉంటాయి. వాటికి విద్యుత్ సరఫరా కావాలంటే అధికారిక ఖర్చులు కాకుండా అనధికార చెల్లింపులు రెట్టింపునుండి నాలుగు రెట్లు ఉంటాయి. బిల్డర్‌లు నిభంధనలను పాటించినాగాని, ఎంతగా రాజకీయ పలుకుబడి ఉన్నాగాని ఫార్మాలిటీస్ పేరుతో ముడుపులు చెల్లిస్తేగాని మోక్షం

మిగతా 3వ పేజిలో

## కాకి లెక్కలు తప్పు నివేదికలు

# లీగల్ మెట్రాలజి శాఖ నిర్వాకం

ఆంధ్రప్రదేశ్‌లో తూనికలు కొలతల శాఖలో సిబ్బంది,అధికారుల కొరత ఆ శాఖను పట్టిపీడిస్తోంది. దానికితోడూ ఉన్నతాధికారులు లక్ష్యాలు నిర్ణయించటంతో కాకి లెక్కలు తప్పు నివేదికలు చోటు చేసుకొంటున్నాయి. తూనికలు-కొలతల,ప్యాకింగు నిభంధనలు 85 శాతం నిక్కచ్చిగా పాటిస్తున్నారని,కేవలం 15 నుండి శాతం మంది మాత్రమే నిభంధనలు అతిక్రమిస్తున్నారని తూనికలు,కొలతల జిల్లా శాఖల (లీగల్ మెట్రాలజి డిపార్టుమెంటు) నివేదికలు స్పష్టంచేస్తున్నాయి. సేకరించిన సమాచారం మేరకు, దాదాపు రాష్ట్ర వ్యాపితంగా ఆ శాఖ నివేదికలు ఇలానే ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క జిల్లాలోతనిఖీ అధికారులందరు కలిపి సుమారు ఆరువేలదాకా వివిధ దుకాణాలు,వ్యాపార సంస్థలు తనిఖీలు నిర్వహించారు. తప్పుడు తూనికలు కొలతలు సంభంధిత ఇతర నిభంధనలకి సంభంధించి 500దాకా కేసులు నమోదుచేసి పెద్దమొత్తంలో జరిమానా విధించారు. అలాగే ప్యాకింగు నిభంధనల ఉల్లంఘనలకు సంభంధించిసుమారు 400దాకా కేసులు నమోదు చేసి జరిమానా/కాంపౌండ్ ఫీజు విధించారు. ఒక్కొక్క జిలాల్లో వారివద్ద ఉన్న జాబితా ప్రకారం 30 నుండి40వేలదాకా షాపులు ,సంస్థలు ఉన్నాయి. ఈ జాబితా ఆయా వ్యాపార సంఘాలు డిపార్టుమెంటుకి అందజేసినవి. ఇతర చట్టాల క్రింద నమోదు అయినవి ఇంకా ఉంటాయి. అసలు ఏ చట్టం క్రింద నమోదుకాని సంస్థలు ,దుకాణాలు కలుపుకుంటే లీగల్ మెట్రాలజి శాఖవద్దఉన్న జాబితాకి రెట్టింపు ఉంటాయని ఒక అంచనా. అధికారుల వద్దఉన్న జాబితా ప్రకారం 16 శాతం దుకాణాలు,సంస్థలు తనిఖీ చేసారు. ఆ లెక్కన మొత్త షాపులు ఒక పర్యాయం తనిఖీ చేయటానికి సుమారు 4 సంవత్సరాల కాలం పడుతుంది. అంటే ఒక్కొక్క షాపుని 4 సంవత్సరాలకు ఒక పర్యాయం తనిఖీ చేస్తున్నారు. కనీసం సంవత్సరానికి ఒక పర్యాయం అయినా తనిఖీచేసే పరిస్థితి లేదు. జిల్లా

మిగతా 4వ పేజిలో

# సంపాదకీయం

# చట్టాల గురించి చైతన్య సమావేశాలు అవసరమా?

మనకు వేలాది కేంద్ర, రాష్ట్ర చట్టాలు ఎన్నో అమలులో ఉన్నాయి. కొన్ని చట్టాలకు సంభంధించి ప్రత్యేకంగా దినోత్సవాలు ,వారోత్సవాలు జరుపుకుంటాము. అయా చట్టాలకు సంభంధించి చట్టాల గురించి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చైతన్య సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఉదాహరణకు, వినియోగదారుల రక్షణ చట్టం, విద్యుత్ చట్టం, అవినీతి నిరోధక చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టం, వృద్ధుల పోషణ చట్టం ఇలా అనేక చట్టాలకి సంభంధించి అధికార, అనధికారులు ఘనంగా దినోత్సవాలు, వారోత్సవాలు నిర్వహించి ఆయా చట్టాలపట్ల అవగాహన కల్పించే నిమిత్తం ఎంతో వ్యయం ప్రయాసలకోర్చి చైతన్య సమావేశాలు నిర్వహిస్తుంటారు. వాస్తవానికి 15 సంవత్సరాల క్రితం వరకు చట్టాలపట్ల చైతన్య సదస్సుల అవశరం ఉండేది.కాని ఇపుడు సాంకేతిక విజ్ఞానం చాలా అభివృద్ధి చెంది సామాన్యులకు సైతం అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో చైతన్య సమావేశాల ప్రాముఖ్యం తగ్గిపోతోంది. ఇంటర్ నెట్ద్వారా ఎంతో సమాచారం ,ఎన్నో అంశాల్లో సెర్చ్ ఇంజన్లద్వారా తెలుసుకోగలిగే వీలుకలిగింది. అయితే అందరికి ఇంటర్ నెట్ ద్వారా తెలుసుకునే అవకాశం లేకపోవచ్చు. అయినా గాని వివిధచట్టాలు, వాటిలోని నిభంధనలు గురించి తెలుసుకోవటమనేది వినియోగదారుల కంటే అయా చట్టాలను అమలు జరిపే చట్టబద్ధ సంస్థలు ,ప్రభుత్వ శాఖల అధికారులకే ఎక్కువ అవశరం ఉంది.అయా చట్టాలోని నిభంధనలు అందరికి ఖచ్చితంగా అమలు జరిగేలా పబ్లిక్ సర్వెంట్లతో సమావేశాలు నిర్వహించి వారిని చైతన్యవంతులను చేస్తే సామాన్య ప్రజానీకానికి సైతం ప్రత్యక్ష ప్రయోజనం ఉంటుంది. అలాకాకుండా చట్టాలు అమలు జరిపే పెద్దలు చట్టాలు పట్టించుకోకుండా ,నిభంధనలకు వక్రభాష్యం చెపుతూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిస్థితులు నెలకొన్న తరుణంలో వినియోగదారులు గాని, ఇతరులుగాని చట్టాల గురించి తెలుసుకుని ప్రయోజనం ఏమిటి.? చట్టాలకి విలువలేని చోట ,నిర్లక్ష్యానికి గురయ్యేచోట చట్టాల పట్ల చైతన్యం కల్పించటం అనేది అధికారుల అదొక కపట నాటకంగా, ఆత్మవంచనగా, లోకవంచనగా బాధితులు పరిగణిస్తారు కాని అదొక చిత్తశుద్ధితో నిర్వహించే కార్యక్రమంగా ఎవరూ భావించరు.ఏ చిన్నపని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల్లో, చట్టబద్ధ వ్యవస్థల్లో లంచాలు ,సిఫార్సులు లేనిదే జరగని పరిస్థితిలో ఏ పనికి ,ఎక్కడ,ఎవరి ద్వారా, ఎంత ఖర్చుచేస్తే పని అవుతుందో చైతన్య వంతులను చేస్తే అది చట్ట విరుద్ధమైనాగాని, కొంత వరకు ప్రయోజనం ఉంటుంది.లేకపోతే మోసగాళ్ళ బారినపడి మరింత నష్టపోతారు. చైతన్య సమావేశాల పేరుతో చట్టాలు నిభంధనలు గురించి కబుర్లు చెపుతూ కాలక్షేపంచేసే బదులు ,ఆయా చట్టాలు వాటి దినోత్సవాల రోజున సమస్యల పరిష్కార సమావేశాలు ఏర్పాటుచేసి న్యాయమైన చిన్నపాటి సమస్యలనైనా పరిష్కారానికి కృషిచేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. అలాకాకుండా చైతన్యం పేరుతో ప్రసంగాలకే పరిమితమైతే ‘ పగలు మాటలు పనిచేటు, రాత్రి మాటలు నిద్రచేటు ‘ అన్న చందంగా ఉంటుంది అయితే కొన్ని అంశాల్లో మాత్రం అవగాహన కల్పించటం తప్పనిసరి..

కాగా, అసలు చట్టాల అమలులో పబ్లిక్ సర్వెంట్లు ,ఇతర చట్టబద్ధ సంస్థల పెద్దలు ఎందుకు విఫలమవుతున్నారు. చిన్న స్థాయి చిరుద్యోగి నుండి ఉన్నత స్థాయిదాకా భాద్యత, జవాబుదారి లేకపోవటం, సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందని లేక చర్యలకి గురవుతామనే బెదురు ,బెంగ లేకపోవటం, లెక్కలేనితనం, చట్టాలను ఎలా బంతిలా ఆడుకోవచ్చో బాగా తెలిసిన నేర్పరితనం, అధికారం ,డబ్బు, మంది మార్బలంతో ఏ చట్టాన్నైనా పొగాకుతో చుట్టచుట్టి ‘చుట్ట‘ తాగొచ్చునే భరోసా, మితిమీరిన రాజకీయ జోక్యం,నిధుల కొరత,ఖాళీ కుర్చీలు (వేకెన్సీలు) కారణంగా కనపడుతోంది. ఉన్నత స్థాయివరకు పలువురు వాళ్ళు ఆ హోదా పొందటానికి ,దాన్ని నిలుపుకోటానికి ఏదొక చట్టాన్నే ఆశ్రయిస్తారు.కాని కొందరు ఇతరులకు చట్టాలను అమలు జరిపే విషయంలో మాత్రం చట్టాలకు కృతిమంగా వికృత రూపం కల్పిస్తారు. దాంతో అనేక చట్టాలు గిట్టనివారిని వేధించటానికి, అస్మదీయులకు మేలుచేసి కాపాడటానికి మాత్రమే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. చట్టాలను అమలు జరిపే పెద్దలు పలువురు తనకు తన కుటుంబానికి, తన బంధుమిత్ర పరివారానికి మాత్రమే చట్టాలపై పేటెంటు హక్కులు ఉన్నట్లు ప్రవర్తిస్తారు. యధేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడతారు.ఇతరుల విషయంలో మాత్రం చట్టాలకు ఎన్ని రకాలుగానో చిల్లులు పొడిచి నిర్వీర్యం చేస్తారు. చట్టాలను అమలు జరిపే భాద్యత కలిగిన పెద్దలు ఇంత విచ్చలవిడిగా చట్టాల ఉల్లంఘనకు పాల్పడటానికి దానితీస్తున్న పరిస్తితులు ఏమిటి.? ఓటరు దురాశ ,మంచిచెడుల విచక్షణ లేకపోవటం ఒక కారణంగా చెప్పవచ్చు, ప్రజల్లో ఎక్కువ శాతం ప్రశ్నించే తత్వంలేకపోవటం, అన్నిటికి సర్దుకుపోటానికి అలవాటుపడటం మరొక కారణంగా చెప్పవచ్చు. మౌన ప్రజ సంఖ్య ఎక్కువగా ఉండి ప్రశ్నించే వారి సంఖ్య తక్కువగా ఉన్నపుడు ఒకరిద్దరు ప్రశ్నించినాగాని ప్రయోజనం లేకపోగా ప్రతిఘటనలు ఎదురౌతాయి. అందువలన ‘సర్దుకుపోదాం రండి‘ అనే నినాదానికి ఆకర్షితులై మౌనంగా ఉండిపోతారు. అలాంటి మూగవాళ్లను అందరిని ఒకచోట పోగేసి చైతన్య సమావేశాల పేరుతో చట్టాల గురించి ఎంతగా నూరిపోసినాగాని ప్రయోజనం ఉండదు.

కాగా చట్టాలకు సంభంధించి ఆయా ప్రభుత్వ శాఖలు ,సంస్థలు ,ఇతర చట్టబద్ధ వ్యవస్థలు తరచుగా సమావేశాలు ఏర్పాటుచేసి. మొదటిగా సమస్యలపై చర్చించి చట్టపరమైన సలహాలు ఇవ్వటం, తదుపరి అవకాశం ఉంటే అప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషిచేస్తే అందరికి ప్రయోజనకరంగా ఉంటుంది.ఉదాహరణకు విద్యుత్ శాఖలో నెలకి ఒకరోజు అదాలత్ పేరుతో వినియోగదారుల సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారం చేస్తున్నారు.అయితే భాద్యతలేని అధికారులు ఉన్నచోట అవిసైతం మొక్కుబడి తంతుగానే కొనసాగుతున్నాయి. ప్రతి సోమవారం అధికారులు గ్రీవెన్స్ డే పేరుతో అర్జీలు

మిగతా 3వ పేజిలో

# అపార్టుమెంట్లకు..

1వ పేజి తరువాయి

కలగదు. చదివింపులు సక్రమంగా చేస్తే ఆఘమేఘాలమీద వర్కు ఆర్డర్‌లు ఒకవేళ వర్కు ఆర్డర్ రాకపోయినాగాని ట్రాన్స్‌ఫార్మర్‌బిగించటం, మీటర్లు బిగించటం విద్యుత్ సరఫరా ఇవ్వటం అన్ని చకచకజరిగిపోతాయి. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు లేకుండానే, కొందరు ఆత్రం అధికారులు మీటర్లు బిగించి, సరఫరా ఇచ్చి బిల్లులు సైతం జారీచేస్తున్నారు. సహజంగా ఏదైనా అవాంతరం ఏర్పడితే ఒక వారం లేకరెండు వారాలు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు లేకుండా సాధారణ లోడుపై విద్యుత్ సరఫరా ఇచ్చినాగాని అవసరార్ధ కార్యంగా భావించవచ్చు. కాని సంభావన పంపకాల్లో తేడా వచ్చి నెలలు, సంవత్సరాలు గడిచినాగాని, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు లేకుండా జనరల్ లోడుపై అపార్టుమెంట్లకి సరఫరా ఇస్తున్నారు. అలాఇచ్చిన సర్వీసులకి ఎపుడో నింపాదిగా కొన్ని నెలలు లేక సంవత్సరాలు గడిచినాక, వాయునాలు ఇచ్చి పుచ్చుకోటాలు సంతృప్తి కరంగా పూర్తి అయినాక ,ట్రాన్స్‌ఫార్మర్‌లు బిగించి అక్రమాలను సక్రమంగా చట్టబద్ధం చేస్తున్నారు. గుంటూరు నగరం, పరిసర ప్రాంతాలలో అపార్టుమెంట్లు పరిశీలిస్తే ట్రాన్సఫార్మర్ మంజూరు అయినాగాని సుదీర్ఘకాలం జనరల్ లోడ్‌పై సరఫరా కొనసాగిన్తున్న సంఘటనలు కనిపిస్తాయి. ఘనంగా సంభావన ముట్టిన అపార్టుమెంటులకు। వరుస క్రమం లేకుండా ఆఘమేఘాలమీద ట్రాన్సఫార్మర్ బిగించి సరఫరా ఇస్తున్నారు. ప్రియారిటీ పట్టించుకోవటం లేదు. ఇష్టారాజ్యంగా ఉంది. అయితే సంభంధిత భాద్యత కలిగిన అధికారులు పలు కారణాల వలన మౌనమునులుగా విధులు నిర్వహిస్తుండటంతో అంతా సవ్యంగానే ఉన్నట్లు గోచరిస్తుంది. అలా ఉన్నతాధికారులకు భ్రాంతి కలిగిస్తుంది. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు ,వర్కు ఆర్డర్‌లు లేకుండానే నేరుగా అపార్టుమెంట్లకి నెలల తరబడి విద్యుత్ సరఫరా ఇస్తున్నాగాని విద్యుత్ సంస్థలో అనేక విభాగాలు ఉన్నాగాని ఎవరికివారు తమకు సంభంధం లేనట్లు వ్యవహరిస్తారు అయితే నిజాయితీ కలిగిఉన్న అధికారులు కొందరు ఉన్నాగాని వారి మాట చెల్లదు. నిజాయితీ కలిగిన అధికారులు ఉన్నచోట వారివాటా సైతం దారితప్పిన అధికారులే కైంకర్యం చేస్తారేగాని వినియోగదారులకు ఆ ప్రయోజనం దక్కదు. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు లేకుండా అధికలోడు కలిగిన అపార్టుమెంట్లకి నేరుగా సాధారణ లోడ్‌నుండి సరఫరా ఇవ్వటం వలన ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లపై లోడు అధికమై అవి తరచుగా కాలిపోతుంటాయి. అందువలన ప్రత్నమ్నాయగా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసేవరకు వినియోగదారులు పరిమితంగా తక్కువ లోడు వినియోగించుకోవాల్సి ఉంటుంది. వినియోగదారుల విషయంలో డబ్బుపోయి శని పట్టటం అంటే ఇదే. ఇక అధికలోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే అది విద్యుత్ సంస్థకి నష్టం. ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌లు బిగించినా లేక పాత ట్రాన్స్‌ఫార్మర్ అధిక లోడ్‌తో కాలిపోయినాగాని అధికారులకు లాభమే. వ్యక్తిగతంగా వచ్చిన నష్టం ఏమిలేదు. బిల్డర్‌కి సైతం వచ్చిన నష్టం ఏమిఉండదు. కాకపోతే నిర్ణీత గడువులో ప్లాట్‌కి విద్యుత్ సరఫరా ఇవ్వకపోతే సేవాలోపం క్రింద బిల్డర్‌పై అధికారులపై సైతం ప్లాట్ కొనుగోలుదారు వినియోగదారుల కోర్టులో కేసుదాఖలు చేసి దాఖలుచేసి తగు ఆదేశాలు పొందటమే కాకుండా పెద్ద ఎత్తున పరిహారం సైతం పొందవచ్చు. అయితే సుభమాఅంటూ కొత్తఇల్లు తీనుకుని బిల్డర్‌పైన, అధికారులపై కేసు వేసి కోర్టుల చుట్టూ తిరగటానికి వినియోగదారులు ఆశక్తి కనపరచరు. అదే బిల్డర్‌కి, అధికారులకు అనుకూల అంశం అయికూర్చుంది.

కాగా, గుంటూరు టౌన్ 1 డివిజన్‌లో వరుస క్రమంలో అపార్టుమెంట్లకు విద్యుత్ ట్రాన్సఫార్మర్లు మంజూరు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలో కొన్ని పంపిణి (డిస్ట్రిబ్యూషన్) కార్యాలయాల లో అపార్టుమెంట్లకి 2 సంవత్సరాలు గడిచినాగాని ప్రత్యేక ట్రాన్సఫార్మర్‌లు బిగించకుండా నేరుగా కనెక్షన్లు కలిపి సరఫరా కొనసాగిన్తున్నట్లు తెలుస్తోంది. ప్రియారిటిని కాదని త్వరితగతిన అఘమేఘాలమీద కొన్ని అపార్టుమెంట్లకిప్రత్యేక ట్రాన్సఫార్మర్‌లు ఏర్పాటుచేసి సరఫరా ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై వినియోగహక్కు ప్రతినిధి డివిజనల్ ఇంజినీరు టి.శ్రీనివాస బాబుని వివరణ కోరటానికి ప్రయత్నించగా నిరాకరించారు.

**అదాలత్‌లు మరచిన డిఇ-**

గుంటూరు టౌన్ 1 పరిధిలో వినియోగదారుల సమస్యల పరిష్కారం నిమిత్తం నెలకి ఒక పర్యాయం నిర్వహించవలసిన విద్యుత్ అదాలత్‌లు డిఇ, శ్రీనివానబాబు తిలోదకాలు ఇచ్చారు. గత సంవత్సరకాలంగా ఏదొక నెపంతో అదాలత్‌లు వాయిదాలు పడుతున్నాయి. అంతకు ముందుసైతం వినియోగదారులు ఏవిధంగా సమస్యలనెదుర్కొంటున్నారో వినియోగదారుల సంఘాలు నియంత్రణా మండలికి ఫిర్యాదు చేసారు. ఏదిఏమైనా సాధారణ బదిలీలలో భాగంగా డిఇ. శ్రీనివాస బాబుని మార్చి 27తేదీన విజయవాడ జోనల్ కార్యాలయానికి బదిలీ చేసారు.

## గుంటూరు టౌన్-1 డిఇ గా హరిబాబు

ఏడిఇగా పనిచేస్తున్న జె. హరిబాబుకి పదోన్నతి కల్పించి గుంటూరు టౌన్ 1డిఇగా నియమించారు. ఆ మేరకు హరిబాబు 29 తేదీన భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘాల ప్రతినిధులు మహ్మద్ రఫీ, సయ్యద్ ఆదం సాహెబ్, జోగారావు, వెంకటేశ్వరరావు దితరులు డిఇ. హరిబాబుకి శుభాకాంక్షలు తెలిపారు.

# చట్టాల గురించి

2వ పేజి తరువాయి

స్వీకరిస్తున్నారు. అవి కొంతవరకు పరిష్కారం అవుతున్నాయి. అలా కాకుండా ప్రతి ప్రభుత్వ శాఖ, సంస్థ ప్రత్యేకంగా కనీసం నెలకు ఒక పర్యాయం వినియోగదారుల లేక సాధారణ ప్రజల సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తే ప్రయోజనం ఉంటుంది. అలా సమావేశాలలో అందిన అర్జీలకు సంభంధించి సమస్య పరిష్కరిస్తే సరి లేకపోతే చట్టపరమైన వివరణతో అర్జీదారుకి సమాధానం ఇచ్చేపరిస్తితి ఉండాలి.

# లీగల్ మెట్రాలజి...

1వ పేజి తరువాయి

'వ్యాపితంగా సంవత్సర కాలంలో 15 శాతం మాత్రమే నిభంధనలు ఉల్లంఘిస్తున్నట్లు నిర్ధారించి జరిమానా విధించారు.మిగతా 85 శాతం అంతా సక్రమంగా నిభంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారించి ఆ మేరకుఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నారు..పెద్ద వ్యాపార సంస్థల్లో సహజంగా నిభంధనలకు అనుగుణంగా ఉన్న నాణ్యత కలిగిన వస్తువులను విక్రయిస్తారు.చిన్న దుకాణాలలో సైతం కొందరు వ్యాపారులు నాణ్యత కలిగిన వస్తువులతోపాటు నకిలి, నాసిరకం,చైనా ఉత్పత్తులు సైతం పెద్ద ఎత్తున విక్రయిస్తుంటారు.చైనా ఉత్పత్తులు సహజంగా ఎక్కువ శాతం ప్యాకింగు నిభంధనలకు అనుగుణంగా ఉండవు. క్రయ విక్రయాల బిల్లులు ఉండవు.ధర విషయంలో వ్యాపారి ఇష్టారాజ్యంగా ఉంటుంది.చైనా ఉత్పత్తులకు గ్యారంటీ సైతం ఉండదు. అయినాగాని దేశీయ ఉత్పత్తుల కంటే చైనా ఉత్పత్తులు ధర తక్కువ ఉండటంతో చైనా ఉత్పత్తులు విక్రయాలు బాగానే ఉంటాయి.ఇక చైనా ఉత్పత్తులతో పాటు నకిలి ,నాసిరకం ఉత్పత్తులు సైతం బహిరంగ విక్రయాలు భారీ ఎత్తున జరుగుతుంటాయి.ఇవేవి ప్యాకింగు నిభంధనలకు అనుగుణంగా ఉండవు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్,గిఫ్ట్ ఆర్టికల్స్, క్లాత్,తదితర అనేక వస్తువులు చైనా, నాసిరకం,నకిలీలు బహిరంగ విక్రయాలు జరుగు తుంటాయి. ఇవి ఎక్కువ శాతం జీరో వ్యాపారంగానే కొనసాగుతుంటాయి. ముఖ్యంగా వీది వీధికి సెల్‌ఫోన్‌లు ,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువల దుకాణాలు మనకు కనవడుతుంటాయి.వాటిలో ప్యాకింగు నిభంధనలకు అనుగుణంగా లేని వస్తువులు అనేకం ఉంటాయి.కాని తూనికలు కొలతల శాఖ అధికారులకు మాత్రం వారి నివేదికల ప్రకారం ప్రతి 10 షాపులలో కేవలం రెండు దుకాణాలలోనే ప్యాకింగు నిభంధనలకు విరుద్ధంగా ఉన్న వస్తువు ఒకటి మాత్రమే కనపడుతుంది. మిగతా 8 దుకాణాలలో విక్రయించే వస్తువులు అన్ని నిభంధనలకు అణుగుణంగానే ఉంటున్నాయి. అయితే వినియోగదారులకు కనపడి కొనుగోలు చేస్తున్న వస్తువులు అధికారులకు ఎందుకు కనపడటంలేదు'?అధికారుల నివేదికల ప్రకారం వినియోగదారులకు వస్తువులు కనవడటం కొనుగోలు చేయటం అంతా భ్రాంతి అని అర్ధం చేసుకోవాలి.లేదా అధికారులు గుడ్డివాళ్ళ అయి ఉండాలి.అధికారుల నివేదికలకే చట్టబద్ధత ఉంటుంది.అక్రమ వ్యాపారాలకు వినియోగదారులు ప్రత్యక్ష సాక్షులు అయినాగాని వాళ్లది భ్రాంతిగానే పరిగణింపబడుతుంది.ఏది ఏమైనా 85 శాతం సక్రమ వ్యాపారంగా అధికారుల నివేదిక 100 శాతం అబద్ధం.

ఇక తనిఖీల గణాంకాలలో సైతం నిజం కానరాదు.విద్యుత్ అధికారులు తనిఖీలకి వెళ్ళినవుడు లోపాలు ఏమిలేకపోయినప్పటికి వినియోగిస్తున్న అన్ని స్విచ్‌లు, ప్లగ్గులు పరిశీలించి ఆ మేరకు తనిఖీ నివేదికలో నమోదుచేసి వినియోగదారులతో సంతకం చేయిస్తారు.అది వాళ్ళు తనిఖీలు చేసారనటాన్కి రుజువు.కాని తూనికలు కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు వాళ్ల డైరీలో రాసుకుంటారు. జరిమానా విధించేటపుడు మాత్రమే పంచనామా నిర్వహిస్తారు. అధికారులకు లక్ష్యాలు నిర్ణయిస్తారు. ఆ మేరకు ఒకటో రెండో దుకాణాలు తనిఖీచేసి తూనికల ప్యాకింగు నిభంధనలకు అనుగుణంగాలేని వస్తువులు ఎన్నో కంటికి కనపడినాగాని ఒక వస్తువుకి జరిమానా విధిస్తారు. అలా సహకరించినందుకు మరో రెండు వస్తువులకు విధించే జరిమానాకి సమానంగా సంభావన స్వీకరించి అటు వ్యాపారికి ఇటు తనకి వ్యక్తిగతంగా ప్రయోజనం కలిగేలా ఉభయతారకంగా వ్యవహారం చక్కపెడతారనే ఆరోపణలున్నాయి అపుడు .నష్టపోయేది అటు ప్రభుత్వం ,ఇటు వినియోగదారులు.ఇక మిగతా షాపులు తనిఖీ చేయకుండా ఉండేనిమిత్తం ఒక్కొక్క షాపుకి ఒక వస్తువుకి జరిమానతో సమానంగా తాంబూలం అందుకుంటారనే ఆరోపణలు సైతం వినవస్తున్నాయి. అదే విధంగా తూనికలు కొలతల నిభంధనలో కూడా వ్యాపారులు అధికారులు పరస్పరం సహకరించుకుంటారు. అంటే సంవత్సరానికి అధికారికంగా వసూలుచేసే జరిమానాకు పదిరెట్లు మామూళ్ళు అందుతాయని ఒక అంచనా .అలా సమకూరిన మొత్తం ఎవరివాటా వారికి వెళ్ళిపోతుదని,. వాటాదారులు సైతం భారీ సంఖ్యలో ఉంటారనేది పరిశీలకుల అంచనాగా ఉంది. అందువలన అంతా సవ్యంగానే ఉన్నట్లు ప్రభుత్వానికి గోచరిస్తుంది.

వినియోగదారుల నుండి ఫిర్యాదులు లేకపోవటంతో వారి సహకారం లేని కారణంగా లక్ష్యాల మేరకు తామే తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామని, అంతకుమించి మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తే వాణిజ్య వర్గాలనుండి ఆరోపణలు ,రాజకీయ నాయకులనుండి వేధింపులు ఎదుర్కోవాల్సివస్తుందని అధికారుల మనసులోని మాటగా ఉంది.కనీసం వినియోగదారుల సంఘాల,స్వచ్ఛంద సంస్థలనుండి అయినా తమకు సహకారం లభిస్తే ఎక్కువ కేసులు నమోదుచేసి అక్రమ వ్యాపారాలను అరికట్టే అవకాశం ఉంటుందనేది అధికారుల అభిప్రాయంగా ఉంది.అయితే ఎవరైనా లంచం అడిగితే ఆ మేరకు ఫిర్యాదు అందితేనే అవినీతి నిరోధక శాఖ అధికారులు ట్రాప్ కేసు నమోదు చేయటాన్కి అవకాశం ఉంటుంది.ఎందుకంటే లంచం అనేది ఇచ్చేవారికి పుచ్చుకునేవారికి మాత్రమే తెలుస్తుంది.ఫిర్యాదు లేకపోతే ఏసిబి అధికారులు ఏమి చేయలేరు. కాని ఇక్కడ అలాకాదు.నిభంధనలకు అనుగుణంగాలేని వస్తువులు ,కాటాలు ,కొలతలు దుకాణాలలో కంటిముందు కనవడుతుంటే ఎవరో వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవశరం ఏమిటి? అది అలా ఉంచితే ఒక్కొక్క తనిఖీ అధికారి పరిధిలో సుమారు 4 వేలదాకా షాపులు,సంస్థలు ఉన్నాయి.ఒక్క అధికారి 4 వేల షాపులు పర్యవేక్షిస్తు, నిఘావేసి తనిఖీలు చేయాలంటే అది ఎలా సాధ్యం?.అవశరమైన మేరకు సిబ్బంది లేకుండా లక్ష్యాలు నిర్ణయిస్తే రెండు జరిమానాలు 4 మామూళ్ళు వ్యవహారంగానే ఉంటుంది.నిజాయితీ అధికారులు ఇమడలేని శాఖగా తూనికలు కొలతల శాఖగా చెప్పవచ్చు .అలాగే తినేవారికి తిన్నంత అవకాశం ఉండే శాఖ కూడా ఇదే అనే అభిప్రాయం సర్వత్రా వినవస్తోంది.. అవసరానికి తగిన విధంగా సిబ్బందిని ,అధికారులను నియమించి ,స్వేచ్ఛగా అధికారులు విధులు నిర్వహించే పరిస్తితులు కల్పించి వినియోగదారులు నష్టపోకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన అవశరం ఎంతైనా ఉంది.ఏది ఏమైనా నిజాయితి కొరవడి దారితప్పిన కొందరు అక్రమ వ్యాపారుల కారణంగా నిజాయితీగా వ్యాపారాలు చేస్తూ సమాజాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్న ఎందరో వ్యాపార వేత్తల గౌరవానికి భంగం కలుగుతున్న మాట యధార్ధం.